నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
11 | హైదరాబాద్, శుక్రవారం 29 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

రామన్నపేట ఎంపీపీ జ్యోతి రాజీనామా

జడ్పీ సీఈఓకు రాజీనామా పత్రం అందిస్తున్న ఎంపీపీ జ్యోతి

రామన్నపేట, మార్చి 28: రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం తన పదవికి రాజీనామా చేశారు. జడ్పీ సీఈఓ శోభారాణికి గురువారం తన రాజీనామా లేఖను అందించారు. అనివార్య కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపీపీ రాజీనామాను ఆమోదించిన సీఈఓ సెక్షన్ 160(4), తెలంగాణ పంచాయతీరాజ్ యాక్ట్ 2018 ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో రామన్నపేట మండలాభివృద్ధికి శాయశక్తులా కృషి చేశానన్నారు. గత సర్వసభ్య సమావేశంలో కొందరు ఎంపీటీసీలు అవహేళనగా మాట్లాడారన్నారు. కొందరు నాయకులు అధికార దాహంతో తనపై అవిశ్వాసం పెట్టినట్లు చెప్పారు. ఇన్ని రోజులు తనకు సహకరించిన మండల అధికారులు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట ఎంపీటీసీలు గొరిగె నర్సింహ, వేమవరపు సుధీర్‌బాబు, దోమల సతీశ్, గాదె పారిజాత ఉన్నారు.

ఓటరు అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి అర్బన్, మార్చి 28 : అర్హులందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగే అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్వీప్ అవగాహన, ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్‌తో జరిగిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు పండుగ లాంటివని, అందులో మనమందరం భాగస్వామ్యులై ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొని, ఓటింగ్ శాతం పెరగడానికి కారణమయ్యారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరుగనున్నదన్నారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని, చుట్టుపక్కల వారికి ఓటు ప్రాధాన్యతను తెలిపి వారు ఓటింగ్‌లో పాల్గొనేలా చేయాలని కోరారు. ఎన్నికల సంఘం సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపుల నిర్మాణం, వలంటీర్లు, వీల్ చైర్లను ఏర్పాటు చేస్తున్నదన్నారు. పోలింగ్ కేంద్రానికి రాలేని 85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించిందన్నారు. ఇలాంటి వారు ఫారమ్ 12-డీ ద్వారా లేదా సాక్ష్యం యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చూపులేని వారు ఓటు వేసేందుకు ఫామ్ 14-ఏ ద్వారా ప్రిసైడింగ్ ఆఫీసర్లు సహాయకుడితో ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తారని, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా నైతిక ఓటింగ్ చేయాలని కోరారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్ మాట్లాడుతూ ఎన్నికలలో ఎక్కడైనా నిబంధనలను అతిక్రమిస్తే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 1950 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ. కృష్ణన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి చంద్రకళ, సీడీపీఓలు స్వరాజ్యం, శైలజ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టి బాలయ్య, దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు ప్రకాశ్, నర్సింహులు పాల్గొన్నారు.

భువనగిరిలో కోమటిరెడ్డి బ్రదర్స్‌కు చెక్!

కాంగ్రెస్ ఎంపీ టికెట్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికే..

రేవంత్‌రెడ్డి వర్గంగా ముద్రపడిన చామల

- తమవారికి సీటు కోసం బ్రదర్స్ వేర్వేరుగా ప్రయత్నాలు
- తొలిసారి కోమటిరెడ్డి కుటుంబం కాకుండా బరిలోకి మరొకరు..
- ఎన్నికల్లో చామలకు కోమటిరెడ్డి వర్గం సహకారం కష్టమేనా?
- కాంగ్రెస్‌లో బీసీలకు మరో సారి మొండిచెయ్యి..

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి పార్లమెంట్ పరిధిలో కోమటిరెడ్డి బ్రదర్స్‌కు చెక్ పడిందా? ఎంపీ సీటు కోసం అన్నదమ్ములు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. భువనగిరిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హవాకు బ్రేకులు పడ్డట్లేనన్న ప్రచారం జరుగుతున్నది. పైరవీలు, లాబీలు, ప్రయత్నాల తర్వాత అంతిమంగా సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన చామల కిరణ్‌కుమార్ రెడ్డికి టికెట్ ఖరారైంది. కాగా, ఎన్నికల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ వర్గం సహకారం ఉంటుందా అనే అనుమానాలు ఆ పార్టీ కేడర్‌లో వ్యక్తమవుతున్నాయి.

- యాదాద్రి భువనగిరి, మార్చి 28 (నమస్తే తెలంగాణ)

పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. వచ్చే నెలలో నోటిఫికేషన్ రిలీజ్ కానుంది. ఇప్పటికే అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే భువనగిరి అభ్యర్థులను ఖరారు చేశాయి. కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డికి ఆ పార్టీ అధిష్టానం ఫైనల్ చేసింది. ఆయనతోపాటు పలువురు పేర్లు ప్రముఖంగా వినిపించినా చివరగా చామలకే టికెట్ దక్కింది. కిరణ్‌కుమార్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి వర్గంగా ముద్ర పడింది. ఢిల్లీలో ఆయనకున్న పరిచయాలకుతోడు రేవంత్ రెడ్డి అండగా నిలువడంతో సీటు దక్కినట్లు చెబుతున్నారు.

బ్రదర్స్‌కు నో చాన్స్

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డికి ఉమ్మడి జిల్లాలో పట్టుంది. తొలుత 2009లో రాజగోపాల్‌రెడ్డి భువనగిరి ఎంపీగా గెలిచారు. 2014లో పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి తనకంటూ అనుచర వర్గాన్ని తయారు చేసుకున్నారు. 2019లో వెంకట్‌రెడ్డి ఎంపీగా గెలిచారు. ఈసారి కూడా తమ కుటుంబ సభ్యులకు లేదా తమ వర్గం నేతలకే టికెట్ ఇవ్వాలని బ్రదర్స్ వేర్వేరుగా పట్టుబట్టారు. వెంకట్‌రెడ్డి తన అన్న కొడుకు సూర్య పవన్ రెడ్డి కోసం, రాజగోపాల్ రెడ్డి తన భార్య లక్ష్మి కోసం ప్రయత్నం చేశారు. కానీ ఈ ఇద్దరు నేతలను కాదని చామల కిరణ్‌రెడ్డికి అవకాశం దక్కింది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారి ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున కోమటిరెడ్డి కుటుంబం సభ్యులు కాకుండా మరో నేత బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే భువనగిరి ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి వర్గం నేతగా ముద్ర పడిన కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఉన్నారు. దాంతో భువనగిరిపై బ్రదర్స్‌కు మెల్లమెల్లగా పట్టు తప్పుతున్నదనే చర్చ నడుస్తున్నది.

చామలకు సహకారం దక్కేనా?

భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా కొనసాగుతున్నారు. ఏడుగురు ఎమ్మెల్యేల్లో పలువురు వెంకట్‌రెడ్డికి సంబంధించిన వారుగా పేరుంది. మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండటంతో పాటు ఆయనకు సైతం ప్రత్యేకంగా అనుచర వర్గం ఉంది. టికెట్ దక్కించుకున్నా కోమటిరెడ్డి బ్రదర్స్‌ను కాదని వారి అనుచరణ వర్గం ఎన్నికల్లో చామలకు సహకరిస్తారా అనేది సందిగ్ధంగా మారింది. చామల గెలిస్తే భువనగిరిలో బ్రదర్స్ ఉనికి తగ్గిపోయే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఎన్నికల్లో బ్రదర్స్ వైఖరి ఎలా ఉంటుందనేది ప్రశ్నగా మారింది.

బీసీ నేతలకు మళ్లీ మొండిచెయ్యి!

కాంగ్రెస్ పార్టీలో మరోసారి బీసీ నేతలకు మొండిచెయ్యి ఎదురైంది. అవసరం వచ్చినప్పుడల్లా బీసీ రాగం ఎత్తుకుంటున్నా చివరకు మాత్రం హ్యాండిస్తున్నారు. భువనగిరి అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీసీలకు టికెట్ ఇవ్వాలని బలంగా కొట్లాడినా ఆఖరికి రెడ్డి సామాజిక వర్గం నేతకే టికెట్ లభించింది. మొదట సైలెంట్‌గా ఉన్న రాజగోపాల్ రెడ్డి ఇటీవల వారం రోజుల క్రితం బీసీలకు టికెట్ ఇవ్వాలనే నినాదాన్ని ఎత్తుకున్నారు. నల్లగొండ పార్లమెంట్ స్థానంలోనూ రెడ్డికే టికెట్ ఖరారు చేసిన విషయం తెలిసిందే.

జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు అమూల్య

చింతిరాల అమూల్య

చింతలపాలెం, మార్చి 28 : బీహార్ రాష్ట్రం పాట్నాలో మార్చి 31నుంచి ఏప్రిల్ 3వరకు జరుగనున్న 33వ జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా నుంచి చింతిరాల అమూల్య రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అండ్ జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అమూల్య ఎంపికకు సహకరించిన అంతర్జాతీయ క్రీడాకారుడు మహేందర్‌రెడ్డికి, రాష్ట్ర, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులకు జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, గ్రామ పెద్దలు ధన్యవాదాలు తెలిపారు.

సేవకుడిలా వచ్చాను.. ఒక్క అవకాశం ఇవ్వండి

- నిత్యం ప్రజల్లోనే ఉండి సేవ చేస్తా
- చదివింది ఎల్ఎల్‌బీ అయినా ఊరుతోనే అనుబంధం ఎక్కువ
- కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే రాష్ట్రానికి మేలు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి
- డ్రగ్స్ కేసులో నిందితులకు ఎంపీ టికెట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ది
- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

విలేకరుల సమావేశం అనంతరం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు

నల్లగొండ, మార్చి 28: నాయకుడిలా కాదు, సేవకుడిలా వచ్చానని.. ఆదరించి ఒక్కసారి అవకాశమిస్తే నిత్యం ప్రజల మధ్యే ఉండి సేవ చేస్తానని బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుంగతుర్తి, మిర్యాలగూడ, నల్లగొండ మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఎన్నడూ లేనంతగా కరువు తీసుకొచ్చి పెట్టిందన్నారు. డిసెంబర్ 9న రైతుబంధు వేస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ మూడు నెలలైనా రైతుబంధు, రైతు బీమా ఇవ్వడం లేదన్నారు. సాగు, తాగు నీరు ఇవ్వకుండా ప్రజలకు కరువు తెచ్చిపెట్టిందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి చెందాలన్నా రైతులకు మేలు జరగాలన్నా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే సాధ్యమన్నారు. ఉద్యమ గడ్డమీద పుట్టిన తనకు ఈ సారి బీఆర్ఎస్ అధిష్టానం నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిందని, ప్రజలు కూడా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఎల్ఎల్‌బీ చదివినప్పటికీ ఊరుతోనే ఎక్కువ అనుబంధం ఉన్నదని, రైతుల కష్టాలు తెలిసిన తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజల మధ్యే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం కేఆర్ఎంబీతో సంబంధం లేకుండా సాగు నీటిని విడుదల చేయించిందని, ఈ విషయమై రేవంత్ సర్కార్ కనీసం దృష్టి సారించక పోవడం వల్లే రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీటి కష్టాలు వచ్చాయన్నారు. కేసీఆర్ అప్పులు తెస్తున్నాడని నాడు విమర్శించిన రేవంత్ రెడ్డి ఇవ్వాల బడ్జెట్‌లో రూ.59వేలు తెస్తామని ఎలా చెప్పాడని ప్రశ్నించారు.

డ్రగ్స్ కేసులో నిందితుడికి ఎంపీ టికెట్ : మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ టికెట్ ఇచ్చిందని అలాంటి వ్యక్తికి ఓటు వేయమని ఎలా అడుగుతుందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ కేసీఆర్ కుటుంబ పార్టీ అని విమర్శించిన కాంగ్రెస్ ఇవ్వాల ఉత్తమ్‌కు రెండు, కోమటిరెడ్డికి రెండు, జానారెడ్డికి రెండు పదవులు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. మీది కుటుంబ పార్టీ కాదా అని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులో నిందితులు అని కూడా పట్టించుకోకుండా ఇంటికి రెండు పదవులు కావాలని పంచుకుంటున్నారని చెప్పారు. అసలు కాంగ్రెస్ పార్టీ టీమ్ లీడరే ఓటుకు నోటు కేసులో దొరికాడని, అందులో సభ్యులు ఉంటే ఏముందిలే అనుకొని టికెట్లు ఇచ్చినట్లు ఉందన్నారు. ఇయ్యాల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం వల్ల ఒక్క నల్లగొండ పార్లమెంట్ పరిధిలో మూడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక బీజేపీ ఈడీ, ఏడీ చూపించి ప్రతిపక్షాలను భయపెడుతుందని విమర్శించారు. ఢిల్లీలో ఏడు సీట్లు గెలుస్తామని చెబుతున్న బీజేపీ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. ఢిల్లీతో పాటు తెలంగాణ, ఆంధ్ర, కేరళ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీకి సీట్లు వచ్చే పరిస్థితులు లేనప్పుడు దేశంలో 400 సీట్లు ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. మోదీ ప్రధానిగా తెలంగాణకు ఏం చేసిండో చెప్పుకోవటానికి ఒక్కటీ లేదని, కానీ మాజీ సీఎం కేసీఆర్ చేసినవి లెక్కబెట్టి వంద చెప్పొచ్చన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మళ్లీ కేసీఆరే రావాలని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ కోసం నిత్యం కష్టపడి మునుగోడు, సాగర్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యేల గెలుపునకు కృషి చేసిన కంచర్ల కృష్ణారెడ్డిపై నమ్మకంతోనే పార్టీ అధినేత ఆయనకు సీటు కేటాయించారన్నారు. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నల్లగొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ ఎంపీపీ కరీంపాషా, అభిమన్యు శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, నాయకులు బకరం వెంకన్న, బొమ్మరబోయిన నాగార్జున, మెరుగు గోపీనాథ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, ఐతగోని యాదయ్య పాల్గొన్నారు.

మండలి చైర్మన్ గుత్తాను కలిసిన కంచర్ల కృష్ణారెడ్డి

బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కంచర్ల కృష్ణారెడ్డి తొలిసారి నల్లగొండకు విచ్చేసిన సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని నల్లగొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కరరావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.

ఈ సారైనా సక్రమంగా సాగేనా?

గతంలో మిల్లులకు ధాన్యం కేటాయింపులో తేడాలు

- కొన్ని మిల్లులకు 200 శాతం ఇస్తే మరికొన్నింటికి 10 శాతంలోపే..
- కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణపై తీవ్ర ప్రభావం
- సూర్యాపేట జిల్లాలో రిటర్న్స్ చాలా తక్కువ
- గత యాసంగి పక్క జిల్లాల్లో 60 శాతం పూర్తయితే ఇక్కడ 16 శాతమే

సూర్యాపేట, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్‌కు ఇచ్చే కేటాయింపుల్లో అధికార యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండగా ఈసారైనా కేటాయింపులు సక్రమంగా జరిగేనా అని మిల్లర్లు ఎదురు చూస్తున్నారు. ధాన్యం కేటాయింపులో పలుకుబడి ఉన్నవాళ్లదే రాజ్యం అన్నట్లు మారిందంటున్నారు. కొన్ని మిల్లులకు సామర్థ్యానికి మించి 150 నుంచి 200 శాతం ధాన్యం కేటాయిస్తే చాలా మిల్లులకు 10 నుంచి 20 శాతం కూడా కేటాయింపులు ఉండకపోవడం గమనార్హం. ఇతర జిల్లాల్లో ప్రధానంగా పక్కనే ఉన్న నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో జిల్లాను యూనిట్‌గా తీసుకొని అన్ని మిల్లులకు సమానంగా ధాన్యం కేటాయింపులు చేయడంతో గత యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ 65 శాతం వరకు పూర్తి చేయగలిగారు. సూర్యాపేట జిల్లాలో మాత్రం అధికారులు ఇష్టారాజ్యంగా కేటాయించడంతో కేవలం 16 శాతానికి మించి సీఎంఆర్ పూర్తి కాలేదు.

ప్రతి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు గ్రామాల వారీగా ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేసి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం జిల్లావ్యాప్తంగా ఉన్న మిల్లులకు కేటాయించడం జరుగుతుంది. కాగా, ఈ కేటాయింపుల్లో ఇతర జిల్లాలతో పోల్చుకుంటే సూర్యాపేటలో మాత్రమే తేడాలు ఉంటున్నాయని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో సేకరించిన ధాన్యాన్ని జిల్లా యూనిట్‌గా తీసుకొని అన్ని మిల్లులకు సమానంగా కేటాయించగా సూర్యాపేటలో మాత్రం ఇష్టారాజ్యంగా పది నుంచి పదిహేను మిల్లులకు సామర్థ్యానికి మించి కేటాయిస్తున్నారని చెప్తున్నారు. అదే సమయంలో 10 నుంచి 20 శాతం ధాన్యం కేటాయించిన మిల్లుల నుంచి 70 శాతం సీఎంఆర్ పూర్తి కాగా, ఎక్కువ ధాన్యం కేటాయించిన మిల్లు నుంచి 10 నుంచి 15 శాతం కూడా రిటర్న్ రాకపోవడం గమనార్హం. దాంతో జిల్లా సగటు 16 శాతం మాత్రమే పూర్తయింది. ఇక వానా కాలం విషయానికి వస్తే ఇప్పటికే పక్క జిల్లాల్లో సీఎంఆర్ పూర్తి కాగా, సూర్యాపేట జిల్లాలో కేవలం 1.70 మాత్రమే పూర్తయింది. ఎక్కువ ధాన్యం కేటాయించిన మిల్లర్ల నుంచి సీఎంఆర్ సకాలంలో రాకపోవడంతో కార్పొరేషన్‌పై వడ్డీ భారం పడుతున్నది. ఈ యాసంగికి సంబంధించి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఈ వారం రోజుల్లో మిల్లులకు కేటాయించనుండగా.. ఈ సారైనా సమానంగా కేటాయిస్తారా లేక పాత పద్ధతినే అవలంబిస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఈ విషయమై అదనపు కలెక్టర్ బి.ఎస్.లతను వివరణ కోరగా 2022-23 యాసంగి ధాన్యాన్ని ప్రభుత్వం టెండర్ ద్వారా విక్రయించడంతో సీఎంఆర్ టార్గెట్ తగ్గిపోయిందని, టెండర్ మినహా మిగిలిన ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ సేకరించాల్సి ఉండగా ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఈ సీజన్‌కు సంబంధించి మిల్లర్లకు ఇంకా ధాన్యం కేటాయింపు జరుగలేదని నిబంధనల మేరకు కేటాయింపులు ఉంటాయని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన

సరిహద్దులో సమన్వయంతో పని చేయాలి

- తెలుగు రాష్ట్రాల అధికారులతో కలెక్టర్లు, ఎస్పీల సమీక్ష

దామరచర్ల, మార్చి 28 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు జిల్లాల ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, సివిల్ సప్లయ్, ఇతర శాఖల అధికారులతో నల్లగొండ, సూర్యాపేట, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు సమావేశమయ్యారు. మండలంలోని ఇండియా సిమెంట్ కర్మాగార సమావేశ మందిరంలో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మే 13న జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నల్లగొండ-పల్నాడు సరిహద్దులో 3 చెక్‌పోస్టులు, నల్లగొండ- సూర్యాపేట సరిహద్దులో 7 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పది చెక్‌పోస్టుల వద్ద ఏడు ప్రభుత్వ శాఖల అధికారులు సీసీ కెమెరాల్లో 2 4గంటలపాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాలో రూ.4.5 కోట్ల నగదు, మద్యం, ఆభరణాలు సీజ్ చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉండే అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దని, ముఖ్యంగా కెనాల్ పాయింట్, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు సరఫరా కాకుండా చూడాలని కోరారు. అనంతరం నల్లగొండ, పల్నాడు జిల్లాల సరిహద్దులోని వాడపల్లి చెక్ పోస్టును అన్నిశాఖల అధికారులు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సమావేశంలో నల్లగొండ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజన్, పల్నాడు, సూర్యాపేట జిల్లాల రెవెన్యూ, పోలీస్, జీఎస్టీ, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువుతో బంగారు భవిష్యత్

- చౌటుప్పల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి

చౌటుప్పల్, మార్చి 28 : విద్య ద్వారానే ఆడపిల్లల బంగారు భవిష్యత్తు సాధ్యమని చౌటుప్పల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ గురుకుల విద్యాలయంలో గురువారం పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చదువు కోవడం ద్వారా జీవితంలో స్థిరపడి స్వతంత్రంగా జీవించవచ్చన్నారు. ఇందుకోసం ఎన్ని కష్టాలు ఎదురైనా వెరువ కుండా చదువు కొనసాగించాలని సూచించారు. అనంతరం బాలికలు జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు ఎలా ఉండాలి, ఎలా చదువుకోవాలనే విషయమై ఆమె వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరోజమ్మ, వైద్యురాలు అలివేలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చౌటుప్పల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి

భవిష్యత్ తరాలకు ఇంధన వనరుల ఉపయోగం తెలుపాలి

- జాతీయ సెమినార్‌లో ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

సెమినార్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రొ॥ గోపాల్‌రెడ్డి

రామగిరి, మార్చి 28 : నేటి ఇంధన వనరులను సక్రమంగా వినియోగించుకుని భవిష్యత్ తరాలు సైతం వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి సూచించారు. నల్లగొండలోని యూనివర్సిటీలో సైన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో 'ఇంధన పదార్థాల అభివృద్ధి తీరుతెన్నులు' అనే అంశంపై గురువారం నిర్వహించిన జాతీయ సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న జీవనశైలి ఇంధన వనరులపై అధిక ఒత్తిడిని కలిగిస్తూ భవిష్యత్ ఇంధన అవసరాలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుందన్నారు. వినియోగదారుల సాధికారత మాత్రమే సుస్థిరమైన జీవితానికి మార్గదర్శి కాగలదని అన్నారు. ఇంధన వనరులను పొదుపుగా వాడుకుంటూ సహజ వనరుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం హైదరాబాద్ ప్రొఫెసర్ వెంకటయ్య, అలాగే వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు శ్రీరామ్‌గోపాల్, నరహరిశెట్టి, ప్రసాద్, విష్ణువర్ధన్‌రెడ్డి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్ సాగర్, ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చిల్కూరి రమేశ్, ఎన్.భిక్షమయ్య, ఆదిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుకు నేడు ప్రత్యేక కౌంటర్

భువనగిరి అర్బన్, మార్చి 28 : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇండ్లు, వ్యాపార సముదాయాలకు సంబంధించిన ఆస్తిపన్ను, నల్లా బిల్లుల చెల్లింపుకోసం శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కార్యాలయానికి సెలవు అయినప్పటికీ బిల్లుల వసూలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. బకాయిదారులు పన్నులు చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

పదో తరగతి పరీక్షకు 26 మంది గైర్హాజరు

భువనగిరి అర్బన్, మార్చి 28 : పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలోని 51 కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన బయాలజీ పరీక్షకు 9130 మంది విద్యార్థులకు గానూ 9104 విద్యార్థులు హాజరుకాగా 26 మంది గైర్హాజరైనట్లు డీఈఓ కె. నారాయణరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈఓతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.